క్లుప్తంగా

నవాబుపేటలో కమలానికి ఆధిక్యం

● మూడో స్థానానికి బీఆర్‌ఎస్

నవాబుపేట: పార్లమెంట్ ఎన్నికలలో మండంలంలో బీజేపీ మిగతా వారికంటే ఎక్కువ ఓట్లు సాధించి పాగా వేసింది. ఎన్నడు లేని విధంగా మెజార్టీ సాధించింది. మండలంలో బీజేపీ 12 గ్రామాల్లో లీడ్ సాధించగా కాంగ్రెస్ 14 గ్రామాల్లో లీడ్ సాధించింది. కాగా అత్యధికంగా మండల కేంద్రంలో బీజేపీ 430 ఓట్ల మెజార్టీ సాధించింది. కారుకొండలో 279, రుద్రారంలో 266 ఓట్ల లీడ్ సాధించింది. మొత్తంగా 1,241 ఓట్ల మెజార్టీ వచ్చింది. మొత్తంగా బీజేపీకి 54 పోలింగ్ కేంద్రాల్లో 13,423 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 12,182 ఓట్లు రావడంతో రెండో స్థానంలో నిలిచింది. కాగా బీఆర్‌ఎస్‌కు 6,317 ఓట్లతో మూడోస్థానానికి పరిమితమైంది. కాగా మన్నెశ్రీనివాస్‌రెడ్డి స్వగ్రామం గురుకుంటలో బీఆర్‌ఎస్‌కు 233 ఓట్ల మెజార్టీ రాగా.. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి స్వగ్రామంలో 50 ఓట్ల లీడ్ వచ్చింది. మొత్తంగా రెండు గ్రామాల్లోనే బీఆర్‌ఎస్‌కు ఆధిక్యం రావడం గమనార్హం.

అడ్డాకులలో కాంగ్రెస్‌కు ..

అడ్డాకుల: పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో అడ్డాకుల మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ లభించింది. అడ్డాకులలో 118, కాటవరంలో 71, తిమ్మాయిపల్లిలో 92, తిమ్మాయిపల్లి తండా 80, గుడిబండలో 240, రాచాలలో 70, పొన్నకల్‌లో 92, శాఖాపూర్‌లో 113, వర్నెలో 81 ఓట్లు కాంగ్రెస్‌కు అధికంగా వచ్చాయి. కందూర్, వడ్డెపల్లి, చౌడాయపల్లి, సుంకరామయ్యపల్లి, గౌరిదేవిపల్లి గ్రామాల్లో కలిపి 321 ఓట్లు బీజేపీకి ఎక్కువగా రాగా ముత్యాలంపల్లిలో 44 ఓట్లు రాంచంద్రాపూర్‌లో 19 ఓట్లు బీజేపీకి లభించాయి. మొత్తంగా గుడిబండలో అత్యధికంగా కాంగ్రెస్‌కు 240 ఓట్ల మెజార్టీ లభించింది.

మూసాపేట మండలంలో బీజేపీకి లీడ్

అడ్డాకుల: మూసాపేట మండలంలో బీజేపీకి 1,157 ఓట్ల మెజార్టీ లభించింది. బీజేపీకి జానంపేటలో 379 ఓట్లు, సంకలమద్దిలో 30 ఓట్లు, పోల్కంపల్లిలో 549 ఓట్లు, వేములలో 220 ఓట్లు, తుంకినీపూర్‌లో 110 ఓట్లు, నిజాలాపూర్‌లో 42 ఓట్ల మెజార్టీ వచ్చింది. అదేవిధంగా కాంగ్రెస్‌కు మూసాపేటలో 2 ఓట్లు, నందిపేటలో 58 ఓట్లు, చక్రాపూర్‌లో 20 ఓట్లు, అచ్చాయపల్లిలో 92 ఓట్లు, స్ఫూర్తితండాలో 66 ఓట్లు, దాసర్‌పల్లిలో 23 ఓట్లు, కొమిరెడ్డిపల్లిలో 113 ఓట్ల మెజార్టీ లభించింది. మూసాపేట మండలంలో ఒక్క తిమ్మాపూర్‌లో మాత్రమే 41 ఓట్లు బీఆర్‌ఎస్‌కు మెజార్టీ వచ్చింది. కాగా పోల్కంపల్లి, జానంపేట, వేముల గ్రామాల్లో అనూహ్యంగా బీజేపీ సత్తా చాటింది. ఇదిలా ఉండగా మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని గాజులపేటలో 879 ఓట్ల భారీ ఆధిక్యం బీజేపీకి లభించడం విశేషం.

భూత్పూర్‌లో డీలాపడిన కాంగ్రెస్

భూత్పూర్: మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీ డీలాపడింది. మున్సిపాలిటీతో పాటు మండలంలో 48 బూత్‌లు ఉండగా బీజేపీకి 12,883 ఓట్లు రాగా.. అధికార కాంగ్రెస్ పార్టీకి 7454 ఓట్లు మాత్రమే వచ్చాయి. బీఆర్‌ఎస్ 5,449 ఓట్లతో మూడవ స్థానానికే పరిమితమైంది. మున్సిపాలిటీలో బీజేపీకి 4,243 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 3,054 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ కేవలం 1211 ఓట్లకే పరిమితమై మూడవ స్థానంలో నిలిచింది.

మునిరంగస్వామి నాటక ప్రదర్శన

జడ్చర్ల టౌన్: మండలంలోని ఆలూరులో గ్రామపంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో శ్రీ రామాంజనేయ భజనమండలి ఆధ్వర్యంలో మునిరంగస్వామి నాటక ప్రదర్శన కొనసాగుతోంది. మూడురోజుల పాటు కొనసాగే నాటక ప్రదర్శన సోమవారం రాత్రి, మంగళవారం రాత్రి పూర్తయ్యింది. బుధవారం చివరిరోజుతో ముగియనుంది. తొలిరోజు మునిరంగస్వామి పాత్రను తిరుపతి, మంగళవారం కృష్ణ, బుధవారం పంతులు శ్రీనివాస్‌లు పోషిస్తున్నారు. నాటకంలో వెంకటయ్య తిరుమలస్వామిగా, మల్లారెడ్డి కృష్ణుడిగా, రాంగౌడ్ సమాధిరంగస్వామిగా, మల్లేష్ శంకరుడిగా, తిరుపతయ్య విష్ణుమూర్తిగా, భూదేవిగా రమేష్, పార్వతిదేవిగా రాజు, వెంకటలక్ష్మి కుమ్మరి ఆంజనేయులు, ఈశ్వర్ అచ్చమ్మగా పాత్రలు పోషిస్తున్నారు. ఏటా పర్వదినాలతోపాటు సెలవుదినాల్లోనూ గ్రామంలో నాటక ప్రదర్శనలు వేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బాలానగర్: క్రీడల్లో ఓటములు –గెలుపు సహజం అని బీజేవైఎం కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నమ్య తండాలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ విన్నర్ జట్టుకు ట్రోఫీని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 4 జట్లు తలపడగా ప్రతి ఒక్కరు మంచి ప్రతిభ కనభరిచారని అన్నారు. గెలుపొందిన జట్టుకు రూ.15 వేల నగదు అందించారు. కుమార్ నాయక్, వడ్య భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్‌లో..



హన్వాడలో నాయకుల సంబురాలు

బీజేపీ నాయకుల సంబురాలు

సాక్షినెట్‌వర్క్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో డీకే అరుణ విజయం సాధించడంతో బీజేపీ నాయకులు సంబురాలు నిర్వహించారు. మూసాపేట, అడ్డాకుల మండలాల్లో బాణాసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

■ నవాబుపేటలో అంబేద్కర్ చౌరస్తాలో టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజు, జిల్లా నాయకులు శ్రీనువాస్, యాదయ్య, బాలు, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

■ జడ్చర్ల పరిధిలో డీకే అరుణ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి పార్టీ అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

■ హన్వాడలో నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు వెంకటయ్య, సీనియర్ నాయకులు కొండబాలయ్య, మాజీ ఎంపీపీ వడ్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

■ మహమ్మదాబాద్ పరిధిలోని గ్రామాల్లో బీజేపీ విజయంపై నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. రాజాపూర్ పరిధిలో డీకే అరుణకు పద్నాలుగు వందలకు పైగా లీడ్ రావడంతో పాటు.. ఆమె ఎంపీగా విజయం సాధించడంతో నాయకులు సంబురాలు చేసుకున్నారు.



భూత్పూర్‌లో సంబురాలు చేస్తున్న బీజేపీ నాయకులు

■ బాలానగర్ పరిధిలో నిర్వహించిన సంబురాల్లో మండల అధ్యక్షుడు పానుగంటి శ్రీశైలం, సీనియర్ నాయకులు సాటి శ్రీనివాస్ యాదవ్, గాండ్ల ప్రభాకర్, వేణు, లింగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

■ చిన్నచింతకుంట పరిధిలో మండల కేంద్రంతో పాటు వడ్డేమాన్ పల్లమర్రి, అప్పంపల్లి, కురుమూర్తి, అమ్మపూరం తదితర గ్రామాల్లోని ర్యాలీలు నిర్వహించారు.

■ భూత్పూర్ పరిధిలో నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. అమిస్తాపూర్, భూత్పూర్ చౌరస్తాలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

■ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండావిశ్వేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిపై భారీ మెజార్టీ విజయం సాధించడంతో గండేడ్ పరిధిలో ఆ బీజేపీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. పగిడ్యాల్, కొంరెడ్డిపల్లి, రంగారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో బాణాసంచా కాల్చారు.



అడ్డాకులలో ..



చిన్నచింతకుంటలో..



మూసాపేటలో..



నవాబుపేటలో..

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యుడు అభిమన్యూరెడ్డి

రాజాపూర్: మండలంలోని రాఘవాపూర్‌లో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం హోమకార్యక్రమాలు నిర్వహించిన అనంతరం దోండ్లపల్లి ఎంపీటీసీ సభ్యుడు అభిమన్యూరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన నాయనమ్మ రేణుకాదేవి జ్ఞాపకార్థం ఆలయాలను నిర్మించడం తన పూర్వజన్మ సుకృతమని అభిమన్యూరెడ్డి పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రామకృష్ణగౌడ్, శ్రీనివాస్, ప్రియాంక, చిరంజీవి, సేవ్యానాయక్, హున్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌కు సన్మానం



గోల్డ్‌మెడల్స్ సాధించిన వారిని అభినందిస్తున్న కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో సీనియర్ మాస్టర్ బాలు నిర్వహించిన టోర్నమెంట్‌లో జిల్లా చాంపియన్‌గా నిలిచిన సాయి నవ్యను మంగళవారం జడ్చర్లలో అభినందించారు. 24వ వార్డు కౌన్సిలర్ ప్రశాంత్ రెడ్డి సాయినవ్యను శాలువాతో సత్కరించారు. అదేవిధంగా గోల్డ్ మెడల్స్ సాధించిన విక్రాంత్, కార్తికేయ, లోహిత్, కరాటే మాస్టర్ మల్లేష్‌ను అభినందించారు. చిన్నారులు చదువుతోపాటు ఇతర రంగాల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ పాల్గొన్నారు.

నెమ్మదిగా సాగుతున్న యూనిఫామ్స్ తయారీ



ఎంఈఓ జయశ్రీకి యూనిఫాం బస్తాలు అప్పగిస్తున్న మెప్మా సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో మహిళా సంఘాల ద్వారా విద్యార్థుల కోసం కొత్త యూనిఫాం కుట్టే పని చాలా నెమ్మదిగా సాగుతోంది. మూడోరోజు మంగళవారం 351 జతల యూనిఫాం కలిగిన బస్తాలను ఎంఈఓ జయశ్రీకి మెప్మా సిబ్బంది అందజేశారు. ఇందులో కుమ్మరివాడి పీఎస్‌లో చదువుతున్న బాలబాలికలకు 48 ఇవ్వనున్నారు. రాంనగర్ పీఎస్‌కు చెందిన వంద, ఎనుగొండ పీఎస్‌కు 179, హౌసింగ్ బోర్డు–ఎదిర పీఎస్‌కు చెందిన 24 జతలు ఉన్నాయి. కాగా, ఈనెల 1న 197, 3న 485 అందజేశారు. ఇలా మొత్తం ఇప్పటివరకు 1,033 జతలు మాత్రమే అప్పగించారు. అధికారులు మాత్రం ఈనెల 6వ తేదీ వరకు మొత్తం 12,329 మంది విద్యార్థులకు కొత్తవి కుట్టించాలని ఆదేశించారు. అయితే గడువులోపు లక్ష్యం చేరుకునే అవకాశం కనిపించడం లేదు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జడ్చర్ల క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కోచ్‌లు, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి

జడ్చర్ల టౌన్: హనుమకొండలో గురువారం నుంచి కొనసాగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలకు జడ్చర్ల క్రీడాకారులు ఎంపికయ్యారు. మంగళవారం జడ్చర్ల మినీస్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి శరత్‌చంద్ర పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల వివరాలను వెల్లడించారు. రితిన్, సాయిప్రణవ్, మధుకుమార్, జ్ఞానేశ్వర్, భవితేజ, కార్తిక్, లక్ష్మి, జీవన్, బాలు, ఐశ్వర్య, శివశంకర్, ప్రకాష్ పోటీలకు వెళ్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మినీస్టేడియంలో శిక్షణ పొందుతూ జిల్లా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 12 మందికి అభినందనలు తెలిపారు. రాష్ట్ర పోటీల్లో రాణించి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సాధారణంగా జడ్చర్ల క్రీడాకారులు ఎక్కడ పోటీలు జరిగినా ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఫ్లైవాక్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, పీఈటీలు ఆనంద్, సునీల్, మోయిన్, శ్రీనివాస్, కృష్ణయ్య, వార్డు కౌన్సిలర్ రమేష్, వాకర్స్ పాల్గొన్నారు.

బడులు తెరిచేలోగా పనులు పూర్తి చేయాలి



పల్లెగడ్డలో పాఠశాల పనులు పరిశీలిస్తున్న అధికారులు

నవాబుపేట: బడులు తెరిచేలోగా పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సీఎంఓ బాలుయాదవ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కామారం, పల్లెగడ్డ, నవాబుపేట పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మండల అధికారులతో ఆయన మాట్లాడుతూ త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. విద్యా సంవత్సరం మరో 9 రోజుల్లో ప్రారంభం కాబోతున్న తరుణంలో అందరూ అప్రమత్తంగా ఉండి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట సీఆర్‌పీ జనార్దన్, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ లక్ష్మమ్మ, హెచ్‌ఎంలు రవి, శ్రీనివాస్, చంద్రకళ, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత కేంద్రంగా మైసమ్మ అడవి



నవాబుపేట: ప్లాస్టిక్ రహిత కేంద్రంగా మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ దేవాలయ ప్రాంతాన్ని చేయాలని నిర్ణయించినట్లు దేవాలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ రవినాయక్ చేతుల మీదుగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ఆయన వివరించారు. మైసమ్మ దేవాలయానికి వచ్చే భక్తులు ప్లాస్టిక్ నిషేధం పాటించాలని, దానిపై ప్రచారం చేస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసేలా కలెక్టర్ ప్రత్యేక కార్యక్రమం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బుధవారం దేవాలయ ఆవరణలో కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నీట్‌లో 'రిషి' విద్యార్థుల సత్తా



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న రిషి యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని రిషి అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈ మేరకు అకాడమీకి చెందిన అనన్య 627 మార్కులు, మౌనిక 621, సఫాన్ సాద్ 610, సంతోష్ 600 మార్కులు సాధించినట్లు అకాడమీ కరస్పాండెంట్ చంద్రకళావెంకట్ పేర్కొన్నారు. 600లకు పైగా ఐదుగురు, 550 మార్కులు 20 మంది, 500లకు పైగా 50 మంది మార్కులు సాధించినట్లు తెలియజేశారు. తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందని, ఎక్కువ సంఖ్యలో మెడికల్ సీట్లు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నీట్‌లో విద్యార్థి ప్రతిభ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని అక్షర ఐఐటీ, నీట్ అకాడమీ విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో సత్తా చాటారు. ఈమేరకు విద్యార్థిని సనా ఫాతిమా 720 మార్కులకు గానూ.. 552 మార్కులు సాధించినట్లు కళాశాల అకాడమీ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

ర్యాలీలో ఉద్రిక్తత

మహబూబ్‌నగర్ క్రైం: పార్లమెంట్ అభ్యర్థిగా డీకే అరుణ గెలుపొందిన తర్వాత ర్యాలీతీయగా.. కొందరు యువకులు మంగళవారం రాత్రి టీడీ గుట్టలో డీజే ఏర్పాటు చేసి నృత్యాలు చేస్తున్న క్రమంలో మరోవర్గం వారు అక్కడికి వచ్చారు. దీంతో పరిస్థితి కొంత అదుపు తప్పింది. దీనిపై ఓ వర్గం వారు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు.





జిల్లా కేంద్రంలో ఓట్ల లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది, లెక్కింపు తీరును పరిశీలిస్తున్న ఏజెంట్లు

'వాగ్దేవి' విజయకేతనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాగ్దేవీ కళాశాల విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. మా విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పోటీ పడేలా తీర్చిద్దామని, ఇన్నొవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక బోధన చేశామన్నారు. కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి తల్లిదండ్రులు, జిల్లా పేరును నిలబెట్టారన్నారు. ఈ మేరకు కళాశాలకు చెందిన 30 నుంచి 45 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి, ఐఐటీ, నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ పావని, యాకుబ్, షాకీర్, శివకుమార్, రాఘవేందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖలో గ్రేడ్-1 పోస్టుమాస్టర్ల బదిలీలు

ఖమ్మంగాంధీ చౌక్: రాష్ట్రంలోని ఐదు హెడ్ పోస్టాఫీసుల్లో పనిచేసే హయ్యర్ సెలక్షన్ గ్రేడ్–1(హెచ్‌ఎస్‌జీ–1) పోస్టుమాస్టర్లను బదిలీ చేస్తూ హైదరాబాద్ ప్రాంతీయ పోస్టుమాస్టర్ జనరల్ సుమిత అయోధ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ హెచ్‌ఎస్‌జీ గ్రేడ్–1 పోస్టుమాస్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డిని వరంగల్ హెడ్ పోస్టాఫీసుకు బదిలీ చేశారు. అలాగే, హన్మకొండ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్ కె.సుబ్రమణ్యంను ఖమ్మంకు, హన్మకొండ హెడ్ పోస్టాఫీస్‌లో డీపీఎం (ఎస్‌బీ) పోస్టుమాస్టర్ ఎం.సురేష్‌బాబును మహబూబ్‌నగర్ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా, కరీంనగర్ హెడ్ పోస్టాఫీస్ డీపీఎం(ఎస్‌బీ) పోస్టుమాస్టర్ కేవీ.పవన్‌కుమార్‌ను హన్మకొండ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా, వరంగల్ హెడ్ పోస్టాఫీస్ డీపీఎం (మెయిల్స్) పోస్టుమాస్టర్ ఏ.తిరుపతిని కరీంనగర్ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా మరో ఇద్దరు పోస్టుమాస్టర్లకు హయ్యర్ సెలక్షన్ గ్రేడ్–1 పోస్టుమాస్టర్లుగా(హెచ్‌ఎస్‌జీ–1) పదోన్నతి కల్పించడమే కాక బదిలీ చేశారు. నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లో పోస్టుమాస్టర్లు(హెచ్‌ఎస్‌జీ–2)గా పనిచేస్తున్న జి.గంగాధర్‌కు హెచ్‌ఎస్‌జీ–1గా ఉద్యోగోన్నతి కల్పించి ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీస్‌కు, కె.అజయ్‌కుమార్‌ను నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లోనే హెచ్‌ఎస్‌జీ–1గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

భారీ భద్రత మధ్య లెక్కింపు



ఓట్ల లెక్కింపు సందర్భంగా వివరాలను ఏజెంట్లకు చూపిస్తున్న సిబ్బంది





ఈవీఎంలను కౌంటింగ్ టేబుళ్ల వద్దకు తీసుకెళ్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ పార్లమెంట్ కౌంటింగ్ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూంలతోపాటు ఆవరణలో భారీ భద్రత కల్పించింది. మంగళవారం జిల్లాకేంద్రంలోని పీయూలో కౌంటింగ్ కేంద్రం చుట్టూ పరిసర ప్రాంతాలతోపాటు ఆవరణలో భారీ పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ప్రారంభం కంటే ముందే ఉద్యోగులు, సిబ్బంది, పార్టీల ఏజెంట్లను గుర్తింపు కార్డులు, అధికారులు జారీ చేసిన పాస్‌లను చూసి పోలీసులు లోపలికి పంపించారు. ప్రధానంగా కౌంటింగ్ జరుగుతున్న భవనాలు అన్నింటిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లెక్కింపు సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ మూడు అంచెల భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశారు. మూడు అంచెల భద్రత వ్యవస్థలో కేంద్ర బలగాలు, ఏఆర్, సివిల్ పోలీసులను ఉపయోగించారు. ఎస్పీ హర్షవర్ధన్‌తోపాటు ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు కౌంటింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

తనిఖీలపై ప్రత్యేక దృష్టి

పార్లమెంట్ ఎన్నికల ఫలితాల సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల లోపలికి వెళ్తున్న ఎన్నికల సిబ్బంది, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు అందరినీ క్షుణ్ణంగా పరిశీలించారు. యూనివర్సిటీ ముఖద్వారం ప్రధాన గేట్ దగ్గర ప్రత్యేక భద్రత కల్పించి లోపలికి వెళ్తున్న వ్యక్తులతో సంబంధిత అధికారులు జారీ చేసిన పాస్ ఉన్నాయా.. లేదా అని ఒకటికి రెండుసార్లు తనిఖీ చేశారు. ప్రధానంగా కౌంటింగ్ భవనం లోపలికి వెళ్తున్న వ్యక్తులు సెల్‌ఫోన్, ఎల్రక్టానిక్ వస్తువులను తీసుకువెళ్లడానికి అనుమతి ఇవ్వలేదు.

ట్రాఫిక్ జాం కాకుండా చర్యలు

పీయూలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్ ప్రధాన రహదారిపై ఉండటంతో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టిపెట్టారు. కేంద్రానికి వచ్చే వాహనాలు అల్లీపూర్ రోడ్డులో పార్కింగ్ కల్పించారు. కొందరు వ్యక్తులకు పీయూ పరిపాలన విభాగం దగ్గర కూడా పార్కింగ్ కల్పించారు. దీంతో రాయిచూర్ రోడ్డుపై ఉన్న పీయూ కేంద్రం దగ్గర ఎలాంటి ట్రాఫిక్ జాం కాకుండా చూశారు.